
https://kirontypeinstitute985233150.wordpress.com/

శ్రీ అష్ట భైరవ ధ్యాన స్తోత్రమ్



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ కాలభైరవ స్వామి చరిత్ర



ఒకప్పుడు ఋషులకు త్రిమూర్తులలో అస్సలు బ్రహ్మము ఎవరు అని సందేహం వచ్చింది. ఆ సందేహమును తీర్చమని వారు త్రిమూర్తులనే అడిగారు.

శంకరుడికి సద్యోజాత, అఘోర, తత్పురుష, ఈశాన, వామదేవ అను అయిదు ముఖములు ఉంటాయి. ఈ అయిదు ముఖములతో ఋషుల వంక చూస్తూ అన్నాడు. "అదేమిటయ్యా బ్రహ్మము ఎవరని అడుగుతారేమిటి? నేనే బ్రహ్మమును" అన్నాడు.

అపుడు బ్రహ్మగారు "నేనే ఈ లోకము లన్నిటిని సృష్టించాను. నేనే నీ పుట్టుక కు కర్తను. నేనే ఈ సమస్త లోకములను ప్రవర్తింపచేశాను. నేనే వీటిని సంహారం చేస్తాను. నేనెప్పుడూ బతికే ఉంటాను. కాబట్టి నాకన్నా బ్రహ్మము ఎవరు? నేనే బ్రహ్మమును అన్నాడు.

తరువాత పక్కనున్న విష్ణువు 'బ్రహ్మ అసలు నీవు పుట్టింది నా నాభి కమలంలోంచి కద, కావున నేనే బ్రహ్మమును అన్నాడు. ఇద్దరికీ ఈ విషయంలో జగడం వచ్చింది.

మనకి శృతి ప్రమాణం కదా అందుకని వేదాలని పిలుద్దాం అని వేదాలని పిలిచారు.

ఋగ్వేదము --- అపుడు ఋగ్వేదం ఈ సమస్తమునకు సృష్టికర్త, ఏ మహానుభావుడు సంకల్పం వలన మొట్టమొదట నారాయణుడు జన్మించాడో, ఎవడు చిట్టచివర ఈ లోకములను తనలోకి తీసుకుంటున్నాడో, అటువంటి ఆ పరమశివుడు పరబ్రహ్మము అంది.

యజుర్వేదము --- తరువాత యజుర్వేదమును పిలిచారు. అసురీశక్తులు పోయి ఈశ్వరీ శక్తులు రావడానికి జ్ఞానమును మహేశ్వరుడు ఇస్తాడు. కాబట్టి జ్ఞాన యజ్ఞమునందు ఆరాధింప బడుతున్నవాడు కనుక పరమ శివుడే పరబ్రహ్మము అని చెప్పింది.

సామవేదము --- తరువాత సామవేదమును పిలిచి అడిగారు. మూడు కన్నులున్న వాడెవడు ఉన్నాడో, ఎవరు ఈ లోకమునంతటినీ తిప్పుతున్నాడో, ఆ తిప్పుతున్న వాడిని ఏ యోగులు ఉపాసన చేస్తున్నారో, ఏ యోగులకి ఉపాసన చేత జ్ఞానమునందు తెలియబడు తున్నాడో, ఎవడు తనలో తాను రమిస్తూ ఉంటాడో, అటువంటి శివుడు పరబ్రహ్మము అని చెప్పింది.

అథర్వణవేదము --- పిమ్మట అథర్వణ వేదము ఏ మహానుభావుడిని భక్తులందరూ సంసార సముద్రమును దాటి దుఃఖమును పోగొట్టుకుని ఆనందమును తెలుసుకోవడానికి ఉపాసన చేస్తున్నారో, అటువంటి పరమశివుడు పరబ్రహ్మము అని చెప్పింది.

అంటే సృష్టి చేసింది మనం కాదు, నిలబెట్టింది మనం కాదు, వేరొకడున్నాడు. తెలుసుకో అని శాస్త్ర ప్రమాణం. నాలుగు వేదములు అదే చెప్తున్నాయి.

ప్రణవం --- ఇప్పుడు ప్రణవాన్ని పిలిచారు. అపుడు ప్రణవం ఎవడు నిరంతరమూ శక్తి స్వరూపముతో క్రీడిస్తూ ఉంటాడో, శక్తి ఆయనను విడిచి పెట్టి ఉండదో, శక్తీశ్వరులై వారున్నారో, అటువంటి శక్తీశ్వరుడై శక్తి ఆయనతో ఆయన శక్తితో విడివడకుండా కలిసి ఉంటారో, అటువంటి పార్వతీ పరమేశ్వరులు, పార్వతి వామార్ధ భాగమునందు ఉన్న శంకరుడే పరబ్రహ్మము అని చెప్పింది.

ప్రణవం చెప్పిన మాటను వాళ్ళు అంగీకరించలేదు. ఈ మాటలు రుచించక పోతే ఇప్పుడు ఈశ్వరుడు దండించవలసి ఉంటుంది. కాబట్టి ఈశ్వరుడు అంతటా నిండిన పరబ్రహ్మము జ్యోతిగా మారాడు.

జ్యోతి సాకారం అయింది. సాకారమును చూసినపుడు విష్ణువు ఊరుకున్నాడు. కానీ బ్రహ్మ నీవు ఎవరు? నువ్వు నా రెండు కనుబొమల మధ్యలోంచి పుట్టిన రుద్రుడవు. నన్ను స్తోత్రం చెయ్యి అన్నాడు.

బ్రహ్మలో మార్పు రాలేదు. ఆయన దండింపబడాలి. కాబట్టి ఇపుడు ఆ జ్యోతి ఘోర రూపమును పొందింది. “శంకర ఏమి నీ ఆజ్ఞ” అని అడిగాడు. బ్రహ్మ అహంకారంతో మాట్లాడుతున్నాడు. అయిదవ తలను గిల్లెయ్యి అన్నాడు.

ఇప్పుడు ఈ స్వరూపం ప్రచండ రూపమును పొందింది. దిగంబరమైన రూపంతో బ్రహ్మ అయిదవ తలను గోటితో గిల్లేసింది. ఆ రూపమే “కాలభైరవ స్వరూపం”.

ఇలా జరిగే సరికి బ్రహ్మ భయపడి పోయి నాలుగు తలకాయలు అమ్మవారి చేతుల క్రింద పెట్టేసి ఈశ్వరా, నేను చేసిన పొరపాటు మన్నించి ఉదారుడవై నన్ను కాపాడు అన్నాడు.

అపుడు శంకరుడు కాల భైరవునితో నీవు కాలము వలె ప్రకాశించు చున్నావు. కాలము ఎలా వెళ్ళిపోతూ ఉంటుందో అలా ఉంది నీ నడక. నీ నడకలో బ్రహ్మ తల తెగిపోయింది కాబట్టి నిన్ను ఇవాళ్టి నుండి కాలభైరవ అని పిలుస్తారు.

కాలభైరవా నీవు ఎంత గొప్ప వాడవయినా బ్రహ్మ తల తెంపేశావు కాబట్టి, నీకు బ్రహ్మ హత్యాపాతకం అంటుకుంది. ఈ అయిదవ తలకాయ పుర్రెను చేతిలో పట్టుకుని పన్నెండు సంవత్సరములు బిక్షాటన చేసి ఆ కపాలంలో తిను. అపుడు నీ బ్రహ్మ హత్యా పాతకం పోతుంది. అని చెప్పాడు.

బ్రహ్మ హత్యా పాతకమును తొలగించుకునేందుకు బ్రహ్మ కపాలాన్ని చేతిలో ధరించి అనేక క్షేత్రాలలో పర్యటించినా తనకు సోకిన బ్రహ్మ హత్యాపాతకము తొలగక పోవడంతో కాలభైరవుడు శ్రీ మహా విష్ణువు వద్దకు వెళ్ళి ప్రార్థించాడు.

కాలభైరవుడి ప్రార్థన విన్న శ్రీ మహావిష్ణువు కాలభైరవా! నీవు శివుడి పుత్రుడవు కనుక శివుడితో సమానుడవు. బ్రహ్మ దేవుడి గర్వమును అణచుటకు జనించినవాడవు. నీవు ఎన్ని తీర్థయాత్రలు చేసినా ఉపయోగం లేదు. కనుక నీవు కాశీ క్షేత్రానికి వెళ్ళు.. కాశీ క్షేత్రంలో అడుగు పెట్టినంతనే నీ బ్రహ్మ హత్యాపాతకం భస్మమై పోతుంది అని సలహా యిచ్చాడు.

దీనితో కాలభైరవుడు కాశీ నగరానికి చేరుకోవడంతోనే బ్రహ్మ హత్యాపాతకం తొలగిపోగా, బ్రహ్మ కపాలాన్ని కాశీలో పూడ్చి పెట్టాడు. బ్రహ్మకపాలం పూడ్చిపెట్టిన చోట ఏర్పడిన తీర్థమే నేటి కాశీ క్షేత్రంలోని 'కపాల మోక్షతీర్థం".

కాశీలో కాలభైరవుడు విశ్వనాథ లింగాన్ని భక్తితో పూజించి తరించాడు. విశ్వనాధుడు కాలభైరవుని భక్తికి మెచ్చి కొన్ని వరాలు ఇచ్చాడు.

కాలభైరవా – ఎవడు ఈశ్వరుని ధిక్కరించి బ్రతుకుతాడో వా ప్రాణోత్క్రమణము అవగానే నువ్వే కనబడతావు. దీనినే 'భైరవ యాతన" అంటారు అప్పుడు జీవుడు నిన్ను చూసి హడలిపోతాడు.

కానీ ఎవరు నీ గురించి వింటారో, శివాలయమునకు వచ్చినపుడు ఎవరు కాలభైరవుడి యందు శిరస్సు వంచి నమస్కరిస్తారో వాళ్ళ పాపమును నీవు తీసెయ్యి. అలా తీసివేసే శక్తి నేను నీకు ఇచ్చాను కాబట్టి నిన్ను "అమర్ధకుడు" అని పిలుస్తారు.

ఇకనుంచి నీవు నా దేవాలయములలో క్షేత్ర పాలకుడవయి ఉంటావు. భక్తుల పాపములను నీవు తీసేసి వాటిని నువ్వు తినేయ్యి. నువ్వు పాపములను తినేసి వాళ్ళను రక్షిస్తావు కాబట్టి నీకు 'పాప భక్షకుడు' అనే పేరును ఇస్తున్నాను. నిన్ను కాశీ క్షేత్రమునకు అధిపతిగా ఉంచుతున్నాను. నీ అనుగ్రహం ఉన్నవాళ్ళే కాశీక్షేత్ర ప్రవేశం చేస్తారు అని చెప్పాడు.

మనల్ని కాశీ క్షేత్రంలోని కాలభైరవుడు ఆ క్షేత్రప్రవేశానికి అనుమతించిన క్షేత్రపాలకుడు కనుక అయ్యా నాకు లోపలికి ప్రవేశింపచేసి నా పాపములను దగ్ధం చేశావు కాలభైరవా అని ఆ మహానుభావుడికి ఇంటికి రాగానే కృతజ్ఞతా పూర్వకంగా కాలభైరవ పూజ అని చేసి ఇక నుండి మంచి పనులు చేస్తాను, అని అన్న సంతర్పణ చేస్తారు. భైరవ మూర్తి ప్రసన్నమూర్తి అయినాడని చెప్పడానికి ఆయన మెడలో ఓ గారెల దండ వేస్తారు. కాశీ సంతర్పణ చేస్తే తప్పకుండా వెళ్ళి ఆ ప్రసాదమును స్వీకరించాలి.

ఇహలోకమునందు ఇప్పటివరకు ఈశ్వరుడి పట్ల తాము చేసిన దూషణలు ఫలితము ఎలా పోతుందని బెంగ పెట్టుకున్న వాళ్ళ కోసం భైరవయాతన ఇక్కడే తేలికగా అనుభవింప చేస్తాడు. అందుకే హరిద్వార్, ఋషికేశ్ వెళ్ళిన వాళ్ళు మానసా దేవి ఆలయమునకు వెళ్లే బయటకు వచ్చేటప్పుడు ఒకసారి ఒంగోండి అని అక బెత్తం పెట్టి వీపు మీద కొడతారు. అది భైరవయాతన అని ఆ కర్ర తప్ అంటుంది. అక్కడితో పాపాలు పోతాయి.

ఆ కాలభైరవ స్వరూపం అంత గొప్పది. 'మేము కాశీ వెళ్ళాము. మాకు ఇంట, బయిట ఏ భయము లేదు అని చెప్పడానికి ఒక నల్లతాడును రక్షగా కట్టుకుంటారు. కాబట్టి అన్ని రూపములుగా ఆ కాలభైరవ స్వరూపం ఆనాడు ఆవిష్కరింపబడింది.

ఎవరు ఆ కాలభైరవ స్వరూపమును గురించి వింటున్నారో, భక్తితో ప్రణమిల్లుతున్నారో, ఒక్కసారి నమస్కరిస్తున్నారో అటువంటి వారు శివానుగ్రహాన్ని పొందుతారు. కాలభైరవుడు వాళ్ళను ఇబ్బంది పెట్టడు. వాళ్ళు ఎప్పుడూ ఎంతో సంతోషంగా, సుఖంగా ఉంటారు.

కాశీ క్షేత్రాన్ని దర్శించిన వారు శ్రీ కాలభైరవ స్వామిని దర్శించడంతో పాటుగా కాశీ నుండి వచ్చిన వారు కాశీ సమారాధన చేయడం ఆచారం అయింది. కాశీ క్షేత్రానికి వెళ్లి వచ్చిన వారు కాశీ విశ్వేశ్వర స్వామి వారిని పూజించడంతోపాటు వడలను చేసి వాటితో మాలను తయారు చేసి పూజానంతరం శునకమునకు పసుపు, కుంకుమలు పెట్టి ఆ మాలను దాని మెడలో వేసి నమస్కారం చేస్తారు. ఆ ఆచారాలు శ్రీ కాలభైరవ స్వామి వారి మహత్యానికి నిదర్శనం.

- - - = - - -

శ్రీ అష్ట భైరవ ధ్యాన స్తోత్రమ్ - భావార్థముతో.

భైరవః పూర్ణరూపోహి శంకరస్య పరాత్మనః।
మూఢాస్తేవై న జానంతి మోహితాః శివమాయయా।

ఓం హం షం నం గం కం సం ఖం మహాకాలభైరవాయ నమః॥

పూర్ణరూపుడు, శంకరుని ఆత్మ స్వరూపుడు, మూఢులకు శివమాయచే ద్యోతకము కానివాడు అయిన శ్రీ కాలభైరవునికి నమస్కరిస్తున్నాను.

(కాలభైరవుడు అంటే శివుని యొక్క భయంకరమైన రూపం. కాల అనే పదానికి శివుడు వలసవాది అనే అర్థం ఉంది. అదే విధంగా భైరవ అనే పదానికి అత్యంత భయంకరమైన రూపం అని అర్థం. ఆ రూపం భయంకరమైనది. అయినప్పటికీ ఈశ్వరుడు తన భక్తుల పట్ల చాలా దయగలవాడు – భోలాశంకరుడే)

అష్ట భైరవ మంత్రమ్

కపాలీ కుండలీ భీమో భైరవో భీమవిక్రమః
వ్యాలోపవీతీ కవచీ శూలీ శూరః శివప్రియాః।
ఏతాని దశ నామాని ప్రాతరుత్థాయ యః పఠేత్
భైరవీ యాతనానస్యాద్ భయం క్వాపి న జాయతే॥

(పై మంత్రాన్ని ప్రతిరోజు ఉదయం నిద్రలేవగానే నిష్ఠగా పఠిస్తే ఏది కోరుకుంటే అది మన వశమవుతుందని పురాణాలు చెపుతున్నాయి.)

అష్ట భైరవ నమస్కార మన్త్రః

ఓం శ్రీ భైరవై, ఓం మం మహా భైరవ్యై, ఓం సిం సింహ భైరవ్యై, ఓం ధూ ధూమ్ర భైరవ్యై, ఓం భీం భీమ భైరవ్యై, ఓం ఉం ఉన్మత్త భైరవ్యై, ఓం వం వశీకరణ భైరవ్యై, ఓం మోం మోహన భైరవ్యై నమః॥

అష్ట భైరవ ధ్యానమ్

అసితాంగో రురుః చండః క్రోధశ్చ ఉన్మత్త భైరవః
కపాలీ భీషణశ్చైవ సంహారశ్చ అష్టభైరవం.

అశితాంగ భైరవ, రురు భైరవ, చండ భైరవ, క్రోధ భైరవ, ఉన్మత్త భైరవ, కపాల భైరవ, భీషణ భైరవ, సంహార భైరవ వీరు అష్ట భైరవులు.

– – – = – – –

అసితాంగ భైరవ ధ్యానమ్



సహచరి : బ్రాహ్మీ
వాహనం : హంస
దిక్కు : తూర్పు

శ్లో॥ రక్తజ్వాల జటాధరం శశియుతం రక్తాంగ తేజో మయం
అస్తే శూలకపాలపాశడమరుం లోకస్య రక్షాకరం।
నిర్వాణం శునవాహనన్ త్రినయనం ఆనందకోలాహలం
వందే భూతపిశాచనాథ వటుకం క్షేత్రస్య పాలం శివం॥

శ్వేత వర్ణుడు, చతుర్భుజుడు, జపమాల, కమండలము, ఖడ్గము, కపాలము ధరించినవాడు, బ్రాహ్మీ - పాలనా దేవతగా కలిగినవాడు, హంస వాహనుడు, తూర్పు దిక్కునకు అధిపతి అయిన శ్రీ అసితాంగ భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

రురు భైరవ ధ్యానమ్



సహచరి : మాహేశ్వరి

వాహనం : వృషభం

దిక్కు : ఆగ్నేయం

శ్లో॥ నిర్వాణం నిర్వికల్పం నిరూపజమలం నిర్వికారం క్షకారం
హుంకారం వజ్రదంష్ట్రం హుతవహనయనం రౌద్రం ఉన్మత్తభావం।
భట్కారం భక్తనాగం భృకుటితముఖం భైరవం శూలపాణిం
వందే ఖడ్గం కపాలం డమరుకసహితం క్షేత్రపాలం నమామి॥

లేత నీల వర్ణుడు, చతుర్భుజుడు, లేడిని, గొడ్డలిని, ఖడ్గము, పాత్రను ధరించినవాడు, మాహేశ్వరి - పాలనా దేవతగా కలిగిన వాడు, వృషభ వాహనుడు, ఆగ్నేయ దిక్కునకు అధిపతి అయిన శ్రీ రురు భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

చండ భైరవ ధ్యానమ్



సహచరి : కౌమారి

వాహనం : మయూరం

దిక్కు : దక్షిణం

శ్లో॥ బిభ్రాణం శుభ్రవర్ణం ద్విగుణదశభుజం పంచవక్త్రం త్రినేత్రం
దానం చిత్రేందు హస్తం రజతహిమమృతం శంఖభేషస్యచాపం।
శూలం ఖడ్గంచ బాణం డమరుక సికతావంచిమాలోక్య మాలాం
సర్వాభీతించ దోర్భీం భుజత గిరియుతం భైరవం సర్వసిద్ధిమ్॥

సరస వర్ణుడు, చతుర్భుజుడు, ధనుస్సు, బాణము, ఖడ్గము, పాత్రను ధరించినవాడు, కౌమారి – పాలనా దేవతగా కలిగినవాడు, మయూర వాహనుడు, దక్షిణ దిక్కునకు అధిపతి అయిన శ్రీ చండ భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

క్రోధ భైరవ ధ్యానమ్



సహచరి : వైష్ణవి
వాహనం : గృధ్రం
దిక్కు : నైఋతి

శ్లో॥ ఉద్యత్ భాస్కరరూప నిభం త్రినయనం రక్తాంగ రాగాంబుజం
భస్మాద్యం వరదం కపాలమభయం శూలం దధానం కరే।
నీలగ్రీవముదారభూషణశతం శంతేశు మూర్థోజ్జ్వలం
బంధూకారుణ వాస అస్తమభయం దేవం సదా భావయేత్॥

ముదురు నీల వర్ణుడు, చతుర్భుజుడు, శంఖము, చక్రము, గద, పాత్రను ధరించినవాడు, వైష్ణవి – పాలనా దేవతగా కలిగినవాడు, గృధ్ర వాహనుడు, నైరుతి దిక్కునకు అధిపతి అయిన శ్రీ క్రోధ భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

ఉన్మత్త భైరవ ధ్యానమ్



సహచరి : వారాహి

వాహనం : అశ్వం

దిక్కు : పశ్చిమం

శ్లో॥ ఏకం ఖట్వాంగ హస్తం పునరపి భుజగం పాశమేకం త్రిశూలం
కపాలం ఖడ్గహస్తం డమరుకసహితం వామహస్తే పినాకం।
చంద్రార్కం కేతుమాలాం వికృతిసుకృతినం సర్వ యజ్ఞోపవీతం
కాలం కాలాంతకారం మమ భయహారం క్షేత్రపాలం నమామి॥

స్వర్ణ వర్ణుడు, చతుర్భుజుడు, ఖడ్గము, కపాలము, రోకలి, డాలును ధరించినవాడు, వారాహి – పాలనా దేవతగా కలిగినవాడు, అశ్వ వాహనుడు, పశ్చిమ దిక్కునకు అధిపతి అయిన శ్రీ ఉన్మత్త భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

కపాల భైరవ ధ్యానమ్



సహచరి : ఇంద్రాణి
వాహనం : ఏనుగు
దిక్కు : వాయవ్యం

శ్లో॥ వందే బాలం స్ఫటికసదృశం కుంభ లోల్లాసివక్త్రం
దివ్యాకల్పై ఫణిమణిమయై కింకిణీ నూపురంచ।
దివ్యాకారం విశదవదనం సుప్రసన్నం ద్వినేత్రం
హస్తాద్యాం వా దధానాన్ త్రిశివమనిభయం వక్రతదండౌ కపాలం॥

మెరిసే పసుపు వర్ణుడు, చతుర్భుజుడు, పిడుగు, పాశము, కత్తి, పాత్రను, ధరించినవాడు, ఇంద్రాణి - పాలనా దేవతగా కలిగినవాడు, గజ వాహనుడు, వాయవ్య దిక్కునకు అధిపతి అయిన శ్రీ కపాల భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

భీషణ భైరవ ధ్యానమ్



సహచరి : చాముండి

వాహనం : సింహం

దిక్కు : ఉత్తరం

శ్లో॥ త్రినేత్రం రక్త వర్ణంచ సర్వాభరణభూషితం
కపాలం శూల హస్తంచ వరదాభయపాణినం
సవ్యే శూలధరం భీమం ఖట్వాంగం వామకేశవం
రక్తవస్త్రపరిధానం రక్తమాల్యానులేపనం
నీల గ్రీవంచ సౌమ్యంచ సర్వాభరణభూషితం
నీలమేఖ సమాఖ్యాతం కూర్చకేశం త్రినేత్రకం
నాగభూషంచ రౌద్రంచ శిరోమాలావిభూషితం
నూపురుస్వన పాదంచ సర్ప యజ్ఞోపవీతినం
కింకిణీ మాలికా భూష్యం భీమరూపం భయావహం॥

ముదురు ఎరుపు వర్ణుడు, చతుర్భుజుడు, ఖడ్గము, కపాలము, త్రిశూలము, రోకలిని ధరించినవాడు, చాముండి - పాలనా దేవతగా కలిగినవాడు, సింహ వాహనుడు, ఉత్తర దిక్కునకు అధిపతి అయిన శ్రీ భీషణ భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

సంహార భైరవ ధ్యానమ్



సహచరి : చండీ

వాహనం : శునకం

దిక్కు : ఈశాన్యం

శ్లో॥ ఏకవక్త్రం త్రినేత్రంచ హస్తయో ద్వాదశం తథా
డమరూంచ అంకుశం బాణం ఖడ్గం శూలం భయాన్వితం
ధనుర్బాణ కపాలంచ గదాగ్నిం వరదం తథా
వామసవ్యే తు పార్శ్వే న ఆయుధానాం విధం తథా
నీలమేఖస్వరూపంతు నీలవస్త్రోత్తరీయకం
కస్తూర్యాది విలేపంచ శ్వేతగంధాక్షతం తథా
శ్వేతార్క పుష్పమాలాంచ త్రికోట్యంగణ సేవితాం
సర్వాలంకార సంయుక్తాం సంహారంచ ప్రకీర్తితం॥

పసుపు నారింజ మిశ్రిత వర్ణుడు, దశభుజుడు, త్రిశూలము, గద, డమరుకం, శంఖం, చక్రం, ఖడ్గం, పాత్ర, కపాలం, పాశం, పాము, ధరించినవాడు, చండీ - పాలనా దేవతగా కలిగినవాడు, శునక వాహనుడు, ఈశాన్య దిక్కునకు అధిపతి అయిన శ్రీ సంహార భైరవునికి ప్రణమిల్లుతున్నాను.

ఇతి శ్రీ భైరవ స్తుతి నిరుద్ర కురుతే

ఇతి అష్టభైరవ ధ్యానస్తోత్రం సంపూర్ణం



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)